క్లుప్తంగా

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారికి అన్ని వసతులూ ఉచితంగా కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

విస్తృతంగా పారిశుధ్య పనులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో శుక్రవారం సామూహిక పారిశుధ్య పనులు చేశారు. రెండు రోజులుగా నగరంలో ఓ మోస్తరు కురుస్తుండడంతో పలు ప్రధాన రహదారుల్లో వర్షపు నీళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల మురుగునీటి కాలువల్లో నీళ్లు ముందుకు కదల్లేదు. కట్టమంచి, కొంగారెడ్డిపల్లె, హై రోడ్డు, పలమనేరు రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. వీటిని ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ పర్యవేక్షించారు. పిచ్చి మొక్కలను తొలగించి, నిల్వ నీటిలో దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు.

నూతన కార్యవర్గం



గంగపుత్ర కో-ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గం

బంగారుపాళెం: గంగపుత్ర ఫిషర్ మ్యాన్ కో–ఆపరేటివ్ సొసైటీ బంగారుపాళెం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి రామ్మోహన్ పర్యవేక్షణలో నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. మండల అధ్యక్షులుగా నాగరాజ, ఉపాధ్యక్షులుగా రెడ్డెప్ప, కార్యదర్శిగా కేశవులు, డైరెక్టర్లుగా మోహన్‌బాబు, రాజేంద్ర, సుభాష్‌చంద్రబోస్, శ్రీనివాసులు, ఉమాపతి, చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మత్స్యఅభివృద్ధి అధికారి పుల్లయ్య, విలేజ్ ఫిషరీ అసిస్టెంట్స్ గౌరీ, మైఖేల్ పాల్గొన్నారు.

ఓంశక్తి భక్తుల అన్నదానం



అన్నదానం చేస్తున్న ఓంశక్తి భక్తులు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో శుక్రవారం ఓం శక్తి భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక దండుమారెమ్మ ఆలయం ఆవరణలోని ఓంశక్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లోకనాథ నాయుడు, గురుశక్తులు కోటేశ్వరమ్మ, కవిత, రూప, పెద్ద సంఖ్యలో ఓంశక్తి అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

పార్వతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



బంగారుపాళెం: మండలంలోని మొగిలి వారిపల్లెలో పార్వతమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఆలయ పూజారి శివస్వామి అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ప్రతి ఇంటి ముంగిట వైద్యసేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ ప్రవీణ్

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకు వైద్యసేవలు అందజేస్తున్నట్లు వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. రాసనపల్లె గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉమామహేశ్వరి, శిరీషా, మల్లిగ, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీజేపీ సెంట్రల్ అధ్యక్షుడిగా షణ్ముగం

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ చిత్తూరు సెంట్రల్ అధ్యక్షుడిగా షణ్ముగం నియమితులయ్యారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు వివరాలను పార్టీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రంభాదొరబాబుగౌడ్ వివరాలను ప్రకటించారు. తనపై నమ్మకంతో రెండోసారి పదవి ఇచ్చినందుకు బాధ్యతను నిలబెట్టుకుంటానని షణ్ముగం తెలిపారు. అనంతరం నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, దామోదార్‌రెడ్డి పాల్గొన్నారు.

బాదుడుపై పోరు

- ఇంధన సర్దుబాటును ఎత్తివేయాలి
- వర్షంలో కట్టమంచి నుంచి ఈఈ కార్యాలయం వరకు ర్యాలీ
- నిరసన అనంతరం విద్యుత్‌శాఖాధికారికి వినతిపత్రం అందజేత



చిత్తూరు: ప్లకార్డులు చేతపట్టి ర్యాలీగా వస్తున్న విజయానందరెడ్డి, చంద్రశేఖర్, పార్టీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోము అంటూ డప్పుకొట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలపై వేల కోట్ల భారం మోపారంటూ వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కట్టమంచి చెరువు సమీపంలోని వివేకానంద విగ్రహం నుంచి శుక్రవారం ర్యాలీని ప్రారంభించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నాయకులు నిరసనలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, వినియోగదారులు భారీ సంఖ్యలో వచ్చారు. కట్టమంచి నుంచి కోర్టుడౌన్ మీదుగా గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి ఈఈ మునిచంద్రకు వినతిపత్రం అందజేశారు.

నెలకు రూ.5 కోట్ల భారం

విజయానందరెడ్డి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై రూ.15 వేలకోట్లకు పైగా భారం వేసిందని చెప్పారు. జిల్లా వాసులపై ప్రతి నెలా రూ.5 కోట్లకు పైగా సర్దుబాటు చార్జీలు బాదుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో పులివెందులలో బాబు ఇచ్చిన విద్యుత్ హామీలను గుర్తు చేశారు. రైతులకు పగటిపూట నాణ్యమైన విద్యుత్ ఇస్తామని, రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచేది లేదని, సంపదను సృష్టించి, సూపర్ సిక్స్ అమలు చేస్తామని బాబు చెప్పిన విషయాలను గుర్తుచేశారు. అధికారం చేపట్టి ఆరునెలలు దాటక ముందే కరెంటు బిల్లులు భారీగా పెంచారని పేర్కొన్నారు. ఇలాగైతే పేద, మధ్యతరగతి వారు బతికేది ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలపై భారం దారుణం

గత ప్రభుత్వ పాలనలో 200 యూనిట్ల విద్యుత్ బడుగులకు ఉచితంగా ఇచ్చినట్లు డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ గుర్తుచేశారు. ప్రస్తుతం వాటిని ఎత్తివేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. దీనికి తోడు కరెంటు చార్జీల భారం వేయడం అన్యాయమన్నారు. పెంచిన చార్జీలు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు జ్ఞానజగదీష్, సూర్యప్రతాప్‌రెడ్డి, మధురెడ్డి, రాజేష్‌రెడ్డి, చక్రి, మనోహర్‌రెడ్డి, దొడ్డిపల్లె శివ, శివారెడ్డి, నారాయణ, కేపీ శ్రీధర్, అను, మనోజ్‌రెడ్డి, వెంకటేష్, శివ, శరవణ, శాంతి, హరిషా, రాజేష్, రంజిత్, చామంతి, ముజీబ్, మురళీ, ఇమ్రాన్, డేవిడ్, గుడిపాల నుంచి ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు ప్రకాష్, రజనీకాంత్, మధుసూదన్‌రాయల్, జనార్దన్, మధుసూదన్ రెడ్డి, రవీంద్రరెడ్డి, వెంకటేష్‌రెడ్డి, నాగేంద్రబాబు, విజయ్, మంజునాథ్, బాబు, చిత్తూరు రూరల్ నుంచి జెడ్పీటీసీ బాబునాయుడు, నాయకులు జయపాల్, సంపత్, త్యాగ, ప్రతిమారెడ్డి, సుబ్రమణి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌పై పోరుబాట

కాణిపాకం: విద్యుత్ బిల్లుల భారంపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శుక్రవారం పూతలపట్టు మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వినియోగదారులు కదం తొక్కారు. ప్లకార్డులతో ర్యాలీగా వచ్చి నిరసన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రంగంపేట క్రాస్ నుంచి ర్యాలీగా బయలు దేరారు. ప్లకార్డులు చేతబట్టి విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ నిరసన తెలిపారు. నినాదాలతో హోరెత్తించారు. కూటమి చేస్తున్న అన్యాయాలపై భగ్గుమన్నారు. కరెంట్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. జోరు వానను సైతం లెక్కచేయకుండా తరలిరావడం విశేషం.

ప్రజలను మోసం చేస్తే ఊరుకోం

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల విషయంలో ప్రజలను మోసం చేస్తే ఊరుకోబోమని మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ హెచ్చరించారు. అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులను పెంచబోమని, నాణ్యమైన కరెంట్ సరఫరా చేస్తామని, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇస్తా మని హామీలు గుప్పించిందని విషయం అందరికీ గుర్తుందని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజలను నిండా ముంచుతోందని ధ్వజమెత్తారు. సర్దుబాటు చార్జీల పేరిట పెనుభారాన్ని మోపుతోందన్నారు. సంపద సృష్టిని పక్కన పెట్టి అదనపు చార్జీల పేరుతో దోచుకోవడం ఏమిటని ప్రశ్నించారు. పెంచిన చార్జీలు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, రాజరత్నంరెడ్డి, జయచంద్రారెడ్డి, బంగారుపాళ్యం మండల కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి, కుమార్ రాజా, జిల్లా మహిళా కార్యదర్శి గౌహతి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీలు దేవిక, సోమశేఖర్, గోవింద స్వామి, పోలవరం సుధాకర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాగరాజు, గజేంద్ర, కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.







చిత్తూరు: ఈఈ మునిచంద్రకు వినతిపత్రం ఇస్తున్న విజయానందరెడ్డి, పూతలపట్టు: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, ట్రాన్స్‌కో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రెవెన్యూ సదస్సులో 13 అర్జీల స్వీకరణ

తవణంపల్లె: రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు 13 అర్జీలు సమర్పించారని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మండలంలోని అరగొండలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని 10 మంది రైతులు వినతిపత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. మ్యుటేషన్ కోసం 10 మంది రైతులు, కొండ్రాజుకాలువ ఆక్రమణలకు గురయ్యాయని సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని రైతులు వినతిపత్రం సమర్పించారు. చారాల దగ్గర దారి ఏర్పాటు చేయాలని, అరగొండలో దారి సమస్య పరిష్కరించాలని అర్జీ వచ్చినట్లు వివరించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తెలపారు. సదస్సులో మండల సర్వేయర్ మురళీకృష్ణ, వీఆర్‌ఓలు రాజేశ్వరి, నేతాజీ, గ్రామ సర్వేయర్లు తేజశ్రీ, సంధ్య, సర్పంచ్ మల్లుదొరై, రైతులు పాల్గొన్నారు.

మన్మోహన్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న విజయానందరెడ్డి, చంద్రశేఖర్ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: మాజీ ప్రధానిమంత్రి మన్మోహన్‌సింగ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళి అర్పించారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండుసార్లు దేశప్రధానిగా చేసిన మన్మోహన్ సింగ్ అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఎక్కడా మచ్చ లేకుండా పరిపాలనా అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు జ్ఞానజగదీష్, బాబునాయుడు, మధుసూదన్‌రాయల్, రజనీకాంత్, మనోహర్‌రెడ్డి, అంజలిరెడ్డి, హరీషారెడ్డి, గీత, మనోహర్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, జయపాల్, సంపత్, త్యాగ, నారాయణ, మధురెడ్డి, మురళీ నాయకులు పాల్గొన్నారు.

జడివానతో ప్రజల అవస్థలు





చిత్తూరు: కురుస్తున్న వర్షంలో వెళుతున్న జనం, బంగారుపాళెం: తడుస్తూ వెళ్తున్న విద్యార్థులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. శుక్రవారం తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు నగరంలో వర్షం కురుస్తూనే ఉండడంతో సామాన్యులకు ఇబ్బందులు తప్పలేదు. దినసరి కూలీలకు పనులు దొరక్కపోగా.. చిరు వ్యాపారులు, హ్యాకర్ల దుకాణాలు పెట్టుకునే పరిస్థితి కనిపించలేదు. అయినా తప్పదన్నట్లు అత్యవసర పనులకు పలువురు గొడుగులతో బయటకు రావాల్సి వచ్చింది.

జోరువాన..!

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం వేకువజాము నుంచి జోరు వాన కురిసింది. వేకువజాము నుంచి ఉదయం 10.15 గంటలకు నిలకడ లేని వర్షం కురిసింది. ఆపై తేలికపాటి వర్షంగా మారింది. మధ్యాహ్నం నుంచి ఎండలు కాశాయి. కురిసిన వర్షానికి రోడ్లంతా జలమయంగా మారింది. పనులకు ఆటంకం కలిగించాయి.

జడివానతో ప్రజల అవస్థలు

బంగారుపాళెం: మండలంలో తెల్లవారు జామునుంచి మధ్యాహ్నం వరకు వర్షం పడుతూ ఉండడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. దీంతో చిరు వ్యాపారులు, తోపుడుబండ్లతో వ్యాపారాలు చేసుకుని జీవనం సాగించుకునేవారికి తీవ్ర ఇబ్బందిగా మారింది. వ్యవసాయ పనులు చేసుకునే రైతులు, కూలీలు అవస్థలు పడ్డారు. కూలీనాలీ చేసుకునే వారి పనులకు ఆటంకం కలగడంతో పనులు మానుకుని ఇళ్లకు పరిమితం అయ్యారు. చలిగాలులకు వృద్ధులు, చంటి పిల్లలు అవస్థలు పడ్డారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.



చిత్తూరు: వాహన చోదకుల అవస్థలు

వర్షానికి రోడ్డుపై కూలిన చింత చెట్టు

తవణంపల్లె: ప్రభావంతో శుక్రవారం వేకువ జాము నుంచి కురుస్తున్న ఎడతెరపిలేని జడివాన కురవడంతో జనాలు ఇంటికే పరిమితమయ్యారు. మండలంలోని దిగువ తడకర వద్ద చింతచెట్టు చిత్తూరు–అరగొండ ప్రధాన రహదారిపై కూలిపోయింది. దీంతో వాహనాలు రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి చింత చెట్టు అకస్మాత్తుగా కూలడంతో దిగువ తడకరలోని ప్రజలు అవాక్కయ్యారు. చెట్టుకూలిన సమయంలో ప్రజలు కానీ వాహనాలు రాకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది. తవణంపల్లె హెచ్‌సీ గజేంద్ర స్థానికుల సహకారంతో కూలిన చింత చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.





అరగొండలో కూలిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు, బంగారుపాళెంలో కురుస్తున్న వర్షం

రూ.14.52 లక్షలకు మార్కెట్ గేటు టెండరు ఖరారు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని మునిసిపల్ ప్రధాన కూరగాయల మార్కెట్‌లో గేటు రుసుములు వసూలు చేసుకునే కాంట్రాక్ట్‌ను రూ.14.52 లక్షలకు దక్కించుకున్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు మార్కెట్ గేటు వసూలు చేసుకోవడానికి కార్పొరేషన్ అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించారు. మునిసిపల్ అధికారుల పాట రూ.14.50లక్షలుగా నిర్ణయించారు. బి.గోపినాథ్‌రావు అనే వ్యక్తి రూ.14.52 లక్షలకు మార్కెట్‌ను దక్కించుకున్నారు. ఇక జంతు వధశాలను రూ.47 వేలు, పాత బస్టాండులో పార్కింగ్ రుసుముల టెండర్‌ను రూ.1.83 లక్షలకు కె.శేషాద్రినాయుడు దక్కించుకున్నాడు.

వన్‌టౌన్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సాయినాథ్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లో సీఐ జయరామయ్యతో కలిసి పలు రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల్లో నిర్లక్ష్యం వద్దని సూచించారు. దర్యాప్తు కేసులను పూర్తిచేసి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. అరెస్టు వారెంట్లను వెంటనే అమలు పరచాలని ఆదేశించారు.

31లోపు అభ్యంతరాలు ఉంటే తెలపాలి

తవణంపల్లె: మండలంలోని ఎస్సీ పాపులేషన్‌పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31వ తేదీ లోపల ఆయా సచివాలయాల్లో తెలియజేయాలని ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండలంలోని 17 సచివాలయాల్లో ఎస్సీల జనాభా నివేదికను ప్రదర్శించినట్లు వివరించారు. ఇందులో ఎలాంటి అనుమానాలు ఉన్నా ఆయా సచివాలయంలో అర్జీలు సమర్పిస్తే పరిశీలించి పరిష్కరిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



రైతు భరోసా కేంద్రం ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఐరాల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి అగ్రానమీ ప్రొఫెసర్ వై రెడ్డిరాము అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లెలో శుక్రవారం చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా నిర్వహించిన ఈ వనమహోత్సవాన్ని ప్రొఫెసర్ రెడ్డిరాము, ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి అసిస్టెంట్ డాక్టర్ లావణ్య ప్రారంభించారు. రెడ్డిరాము మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతను కాపాడడంలో మొక్కలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులతో కలిసి వారు సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఆవరణం, గ్రామంలోని ఖాళీ స్థలాల్లో అంజన్, ఎర్ర చందనం మొక్క, అంజీర్ మొక్కలను నాటారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి గ్రామంలో ఉన్న రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పండించే పంటల గురించి ఆరా తీశారు. గ్రామానికి కావలసిన మౌళిక వసతులపై, సామాజిక ఆర్థిక సర్వే ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఈ నెల 30న చిత్తూరులో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ అంశంపై స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం జిల్లా నాయకులు నాగరాజన్, గంగరాజు మాట్లాడారు. అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఆ రోజున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి అలా మాట్లాడడం దారుణమన్నారు. ఈ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత వచ్చిన ప్రధాన మోదీ ఆయన్ను వెనకేసుకురావడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరిచంద్ర, బాలసుబ్రమణ్యం, దాము పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



ఎస్‌ఐ నాగసాజన్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నాగసాజన్య అన్నారు. నగరంలోని తపోవనం వద్ద ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె అతిథిగా హాజరయ్యారు. ఎస్‌ఐ మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే అమ్మాయిలు దూసుకెళతారని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపల్ సాగరిక మాట్లాడుతూ బాలికలకు ప్రత్యేక రక్షణ చట్టాలు అమల్లో ఉన్నట్లు తెలిపారు. ఆ చట్టాలపై చిన్నతనం నుంచే అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ చక్రధర్, అకడమిక్ డీన్ ఇక్బాల్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు ముఖ్యం



విద్యార్థులకు చికిత్సలు చేస్తున్న డాక్టర్లు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తప్పక పాటించాలని శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు మధుసూదనం అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని కృష్ణవేణి ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో తమ సంస్థ ఉచిత వైద్య శిబిరం నిర్వహించిందన్నారు. ఈ శిబిరంలో నిష్ణాతులైన డాక్టర్ల చేత విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ సరిత మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకూడదని చెప్పారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఆ కళాశాల బాలికలకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగరంలోని ఓ ప్రైవేట్ మెడికల్ ఆస్పత్రి డాక్టర్లు రాధాకుమారి, హరి, ఆశ, నవీన్‌కుమార్, శ్రీ సత్యసాయి సేవా సంస్థ సభ్యులు శేషనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.